సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 15 । మే । 2025



సోమశిలలో 48.213 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం నాటికి 48.213 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 5,730, ఉత్తరకాలువకు 100, దక్షిణకాలువకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.96,700
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,805
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,069
సవర (8 గ్రాములు)	రూ.72,552

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.3 /30.0

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు మరింత అధికంగా ఉండే అకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. బుధవారం గాలిలో తేమ 56 శాతంగా ఉంది.

న్యూస్‌రీల్

కళ్లకు గంతలు కట్టుకుని కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ముత్తుకూరు (పొదలకూరు): మండలంలోని నేలటూరు జెన్‌కో అవుట్ సోర్సింగ్ కార్మికులు నెల రోజులకు పైగా కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం వినూత్నంగా కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ 32 రోజులుగా వివిధ రకాలుగా నిరసన వ్యక్తం చేస్తున్నా.. యాజమాన్యం స్పందించకపోవడం సిగ్గు చేటైన విషయమని ధ్వజమెత్తారు. అవుట్ సోర్సింగ్ కార్మికులను కాంట్రాక్ట్ కార్మికులుగా పరిగణించాలన్నారు. ఈ ఆందోళనలో జేఏసీ కన్వీనర్ గోడ భాస్కర్, నాయకులు శేఖర్, ఆదిశేషయ్య, శ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 560 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా బుధవారం 560 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షకు 14,130 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 13,626 మంది హాజరు కాగా, 504 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షకు 1,461 మందికి 1,405 మంది విద్యార్థులు హాజరయ్యారు. 56 మంది గైర్హాజరయ్యారు. ఆర్ఐఓ టి. వరప్రసాదరావు 17 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

విమానాశ్రయ భూములకు పరిహారంపై విచారణ

దగదర్తి: దగదర్తి విమానాశ్రయ భూములకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రైతులకు చెల్లించాల్సిన పరిహారంపై బుధవారం తహసీల్దార్ కృష్ణ అధ్యక్షతన కొత్తపల్లి కౌరుగుంట సచివాలయంలో విచారణ నిర్వహించారు. రెవెన్యూ రికార్డుల్లో తప్పులు, కుటుంబ వివాదాల కారణంగా కొంత మంది రైతులకు పరిహారం చెల్లించే ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. గత ప్రభుత్వంలో పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టినా వివాదాలతో ముందుకు రాలేదు. ప్రస్తుతం విమానాశ్రయ పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పెండింగ్‌లో ఉన్న రైతులకు పరిహారం చెల్లించేలా చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ కృష్ణ తెలిపారు. ఎటువంటి వివాదాలు లేని భూములకు పరిహారం చెల్లిస్తామని, రైతులు అందరూ ముందుకు రావాలని కోరారు. కొత్తపల్లి కౌరుగుంట రెవెన్యూ పరిధిలో 65 మంది రైతులకు సంబంధించి సుమారు 89 ఎకరాలకు పరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. సీజేఎఫ్ఎస్ భూము లు, డీకేటీ భూములకు ఎకరాకు రూ.13 లక్షలు, పట్టా భూములకు రూ.26 లక్షల పరిహారం చెల్లిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కేకే గుంట సర్పంచ్ అశోక్, వీఆర్ఓ బాల నాగమ్మ, ఆర్ఐ శివ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్ తహసీల్దార్ సస్పెన్షన్

నెల్లూరు (అర్బన్): నెల్లూరురూరల్ మండల తహసీల్దార్ లాజరస్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ బుధవారం రాత్రి కలెక్టర్ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ పదే పదే ఆదేశిస్తున్నారు. ఒక వేళ పరిష్కరించలేకపోతే అందుకు గల కారణాలు స్పష్టంగా వివరించాలని సూచించారు. అయితే భూ సమస్యలు, ఇతర సమస్యలకు సంబంధించి 17 వినతులను పరిష్కరించకుండానే పరిష్కరించినట్టు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. విధుల్లోనూ నిర్లక్ష్యం వహించారు. దీంతో ఈ మేరకు తహసీల్దార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ చర్యలు తీసుకున్నారు.

కృష్ణపట్నం పోర్టులో కస్టమర్ల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పోర్టు అధికారులు

ముత్తుకూరు (పొదలకూరు) : అదానీ కృష్ణపట్నం పోర్టులో బుధవారం కస్టమర్ల సమావేశం నిర్వహించారు. పోర్టు, బీపీసీఎల్ గతి యూనిట్లో లోడింగ్ పెంపొందించేందుకు వివిధ మార్గాలపై చర్చించారు. ఇందుకోసం భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, పోర్టు నిబంధనలను ఉల్లంగించకూడదన్నారు. అనంతరం ఓబులవారిపల్లె–కృష్ణపట్నం రైల్వేలైన్‌ను పరిశీలించారు. ఈ సమావేశంలో సీనియర్ డీసీఎం రాంబాబు వావిలపల్లి, సీనియర్ డీఓఎం డి.నరేంద్రవర్మ, సీనియర్ డీఎస్ఓ బి.ప్రశాంత్ కుమార్, సీనియర్ డీఎంఈ సంజయ్ అంగోతు, పబ్లిక్ రిలేషన్ ఇన్స్‌పెక్టర్ జే దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనకొండలకు కానుక

- అదే కొండ మధ్యలో జాతీయ రహదారి నిర్మాణానికి క్లియరెన్స్‌కు ఏళ్ల తరబడి పట్టిన కాలం
- తాజాగా ఎన్‌హెచ్ విస్తరణకు అనుమతి ప్రతిపాదనలు ఏళ్లుగా పెండింగ్
- క్వారీకి అనుమతులిస్తే వన్యప్రాణులకు చేటు
- దళిత కాలనీకి పర్యావరణ పోటు

అటవీ భూముల్లో క్వారీకి ఆగమేఘాల మీద అనుమతులు

అటవీశాఖ భూముల్లో క్వారీ నిర్వహణకు అనుమతులిచ్చేందుకు పలు శాఖల అధికారులు బరి తెగించారు. అధికార పార్టీలోని అనకొండలు విసిరిన నోట్ల కట్టలకు కొండలను కానుక ఇచ్చేందుకు ఆగమేఘాల మీద సిద్ధపడ్డారు. రాసివ్వడానికి ఇదేమైనా వీరికి అత్తగార్లు ఇచ్చిన జాగిర్లు కాదే. అటవీశాఖ భూములను ప్రజాప్రయోజనాలకు వినియోగించాలన్నా.. కేంద్ర అటవీశాఖతోపాటు పర్యావరణ శాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంది. ఇందుకు విరుద్ధంగా జిల్లాలోని అటవీ, పర్యావరణ, రెవెన్యూ శాఖలు కట్టకట్టుకుని వచ్చి ప్రజాభిప్రాయ సేకరణ చేయడం చూస్తే ఏ స్థాయిలో చట్టాన్ని ధిక్కరించి అధికార పార్టీకి ఊడిగం చేస్తున్నారో అర్థమవుతోంది.



సంగం కొండ దిగువ ప్రాంతంలో ఉన్న అరుంధతీయవాడ

సంగం : కోట్లకు అధిపతులు.. అయినా వారి ధనదాహం తీరడం లేదు. ప్రకృతి సృష్టించిన సహజ సౌందర్యాలను విధ్వంసం చేస్తూ.. పర్యావరణాన్ని దెబ్బతీస్తూ.. అక్కడి నివసించే ప్రజల ప్రాణాలకు, కొండనే ఆవాసంగా చేసుకుని బతుకుతున్న వన్య ప్రాణులకు ముప్పు తలపెడుతూ భవిష్యత్‌లో మహా ప్రళయానికి అధికార పార్టీ పెద్దలు బరితెగించారు. ఇప్పటికే సహజ వనరులను దోచేసిన ఈ ముఠా తాజాగా ప్రకృతి సోయగాలను సైతం కనుమరుగు చేస్తూ.. ఇనుప పెట్టెలను నింపుకునే పనిలో పడ్డారు.

రామా.. ఇదేంటి సుమా..!

ఎన్నికల సమయంలో సంగం కొండను చూస్తే బాధ వేస్తుందని నంగనాచి ప్రసంగాలు చేసిన ఆనం రామనారాయణరెడ్డి ప్రస్తుతం సంగం కొండపై క్వారీకి అనుమతులివ్వడానికి సిద్ధపడడంపై విమర్శలకు దారి తీస్తోంది. తన మంత్రి పదవికి అడ్డుగా రాకుండా వేమిరెడ్డి దంపతులపై ప్రేమతో కోవూరుఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బంధువుకు ఇక్కడ క్వారీ ఇచ్చినట్లు తెలుస్తోంది. 'రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా; అన్నట్లు క్వారీని కట్టబెట్టడానికి అధికారుల యంత్రాంగం ఆగమేఘాల మీద పరుగులు తీస్తోంది. హడావుడిగా మంగళవారం సంగంలో ప్రజాభిప్రాయ సేకరణ సైతం చేపట్టి, ఎటువంటి సమాచారం బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. అయితే ప్రజాభిప్రాయ సేకరణలో పలువురు క్వారీతో వచ్చే సమస్యలు తెలిపినప్పటికి అధికారులు మౌనం పాటిస్తూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామనడం చెప్పినట్లు తెలుస్తోంది.

కేంద్ర అటవీశాఖ అనుమతి లేకుండానే..

సంగం కొండ మీద అటవీ భూముల్లో కేంద్ర అటవీశాఖ అనుమతి లేకుండానే క్వారీ ఏర్పాటుకు ఆగమేఘాల మీద అడుగులు పడుతున్నాయి. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బంధువు నెల్లూరుకు చెందిన డీ మమతారాణి సంగం కొండపై క్వారీలో 26,350 ఘ.మీ. కంకర తవ్వకునేందుకు అనుమతినివ్వాలని అటవీ శాఖ అధికారులకు అర్జీ పెట్టుకున్నారు. వీరితోపాటు రెవెన్యూ, పర్యావరణ శాఖలకు సైతం భారీ స్థాయిలోనే నజరానాలను ముందుగానే ముట్టజెప్పినట్లు సమాచారం. దీంతో నెల రోజుల వ్యవధిలో అటవీ, పర్యావరణ, రెవెన్యూ శాఖల వద్దకు అర్జీ పరుగులు తీసింది. సంగం కొండ అటవీశాఖ రక్షిత ప్రాంతంలోని సర్వే నంబరు 361లోని 376వ కంపార్టుమెంట్‌లో 1.85 హెక్టార్ల భూమిని డీ మమతారాణికి క్వారీ నిర్వహణకు కౌలుకు ఇస్తున్నట్లు అటవీశాఖ అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది.

జాతీయ రహదారికి అనుమతికి ఏళ్ల తరబడి..

సంగం కొండ మధ్య నుంచి నెల్లూరు– ముంబై రహదారిని నిర్మించడానికి అప్పట్లో అటవీశాఖ నుంచి అనుమతులు రావడానికి సంవత్సరాల తరబడి సమయం పట్టింది. రాష్ట్ర అటవీశాఖకు సంబంధించిన భూములైనప్పటికీ ప్రజాప్రయోజనాల కోసమైనా కేంద్ర అటవీశాఖ అనుమతి పొందాల్సి ఉంటుంది. ఈ కారణంగానే కొండ మధ్య భాగం తవ్వి జాతీయ రహదారిని నిర్మించడానికి చాలా కాలం జాప్యం జరిగింది. తాజాగా ఇదే రహదారిని విస్తరించేందుకు అనుమతుల కోసం ప్రతిపాదనలు చేసి ఏళ్లు గడుస్తోంది. అయినా ఎప్పటికి వస్తుందో.. అసలు రాదో తెలియని పరిస్థితి. అయితే క్వారీ నిర్వహణ ప్రజాప్రయోజనాల పరిధిలోకి రాకపోయినప్పటికీ, కేంద్ర అటవీశాఖ అనుమతి లేకపోయినప్పటికీ జిల్లా అటవీ శాఖాధికారులు అనుమతులిచ్చేయడం వెనుక రూ.కోట్లల్లో చేతులు మారాయనే అరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగా చట్టాన్ని, అధికారాలను ధిక్కరించి అడ్డగోలుగా క్వారీకి అనుమతులిచ్చేందుకు ఆగమేఘాల మీద అధికారులు హడావుడి చేస్తున్నారు.



వన్యప్రాణులకు చేటు

సంగం కొండపై రకరకాల పాములు, కోతులు, జింకలు వంటి వన్యప్రాణులు ఉన్నాయి. ఇక్కడ క్వారీ ఏర్పాటు చేస్తే వీటి మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. అయితే ఇక్కడ వన్యప్రాణులు లేవని అటవీ శాఖ అధికారులు నిర్ధారించడం వారి అవివేకానికి నిదర్శనం. సంగం కొండ మీద నుంచి పలు సందర్భాల్లో జింకలు నీటి కోసం సంగం జనావాసాల్లోకి వచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. వన్యప్రాణులకు ఇబ్బందులు వచ్చే అటవీ అనుమతులు ఇవ్వొవద్దని దేశ అత్యున్నత న్యాయస్థానం సైతం పలు సందర్భాల్లో తీర్పులు ఇచ్చినా రాజకీయ నేతల ఒత్తిడితో అటవీశాఖ అధికారులు అనుమతులిచ్చినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఎవరైనా కోర్టుకు వెళితే తమ పీకల మీదకు వస్తుందని అటవీశాఖ అధికారులు సతమతమవుతున్నారు.

అభిప్రాయ సేకరణలో భిన్నాభిప్రాయాలు

క్వారీ ఏర్పాటుపై సంగం సచివాలయంలో మంగళవారం అధికారులు నిర్వహించిన అభిప్రాయ సేకరణలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ముందుగా క్వారీ అనుమతికి దరఖాస్తు చేసుకున్న వ్యక్తులు తమ మనుషులతో మాట్లాడించారు. దీంతో ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన అనేక మంది క్వారీ ఏర్పాటు చేస్తే సమస్య వస్తుందని తెలిసి కూడా రాజకీయ నాయకుల ముందు తమ అభిప్రాయాలు వెల్లడించలేదు. అయితే ప్రజలకు నష్టం వాటిల్లే క్వారీతో ఇబ్బందులు ఉన్నాయని పలువురు సంఘాల నేతలు, టీడీపీ నాయకులు సైతం పేర్కొన్నారు.



ప్రజాభిప్రాయసేకరణలో మాట్లాడుతున్న అధికారి (ఫైల్)

మహా ప్రళయంపై ఆందోళనలో దళితులు

సంగం కొండ మీద క్వారీ ఏర్పాటు చేస్తున్నారనే సమాచారం తెలియడంతో కొండ కింద ఉన్న అరుంధతీయులు ఆందోళన చెందుతున్నారు. కొండపై క్వారీకి అనుమతిస్తే.. భవిష్యత్‌లో భారీ వర్షాలు కురిస్తే కొండ చెరియలు కరిగి దిగువన ఉన్న నివాసాలను కప్పేసే ప్రమాదం ఉందని స్థానికులు భయకంపితులు అవుతున్నారు. గతేడాది కేరళలోని వాయనాడ్ ప్రాంతంలో భారీ వర్షాలకు ఊరుకు ఊరుకే సమాధి అయిన విషయం తెలిసిందే. ఇలాంటి పరిస్థితి తమకు ఎదువుతుందంటున్నారు. గతంలో కొండ దిగువన ఉన్న క్వారీ కోసం జరిపిన పేలుళ్ల ధాటికి సంగం రాళ్లచెలిక ఎస్సీ కాలనీలో రాళ్లు పడి పలు ఇళ్లు ధ్వంసం కాగా పలువురు గాయపడిన సందర్భాలు ఉన్నాయి. ఆ క్వారీని మూసి వేస్తే ఆనంద పడ్డామని, మళ్లీ కొత్త క్వారీ వస్తే ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నామని దళితులు ఆవేదన చెందుతున్నారు.

వన్యప్రాణులకు ముప్పు



సంగం కొండ మీద క్వారీ ఏర్పాటు చేస్తే వన్యప్రాణులకు ముప్పు ఏర్పడుతుంది. ప్రతి నిత్యం క్వారీలో జరిగే పేలుళ్ల వల్ల స్థానికంగా ఉండే నివాసాలకు ప్రమాదం పొంచి ఉంది. రెండేళ్ల క్రితం ఓ నాయకుడు క్వారీకి దరఖాస్తు చేసుకోగా అప్పట్లో జరిగిన ప్రజాభిప్రాయసేకరణలో నిరాకరించడం జరిగింది.

– కాకు మధుసూదన్‌యాదవ్, టీడీపీ నేత, సంగం

ప్రాణాలతో చెలగాటం



సంగం కొండపై క్వారీ ఏర్పాటు చేసి దళితుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. క్వారీ పేలుళ్ల ధాటికి వారి ప్రాణాలతోపాటు ఆస్తులు పోయే ప్రమాదముంది. ఎట్టిపరిస్థితుల్లో క్వారీకి అనుమతుల ఇవ్వడానికి ఇక్కడి వారెవరూ సిద్ధంగా లేరు. అవసరమైతే న్యాయపోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నారు. అధికారులు పునరాలోచన చేయాలి.

– తోకల మురళి, ఎస్ఎఫ్ఐ, జిల్లా మాజీ అధ్యక్షుడు

స్వయంశక్తితో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- కలెక్టర్ ఆనంద్




మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్

ఇందుకూరుపేట: ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో స్వయంశక్తి సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న అరటినార ఉత్పత్తుల శిక్షణా కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఈ శిక్షణా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఇంటి వద్ద నుంచే మెరుగైన ఆదాయం పొందాలని కోరారు. శిక్షణ పూర్తి చేసుకొన్న మహిళలకు అరటినార ద్వారా ఉత్పత్తులను తయారు చేసేందుకు అవసరమైన యంత్రాల కోసం రుణాలు మంజూరు చేస్తామన్నారు. లాభాలు గడించేందుకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టించాలనే లక్ష్యంతో రీసైక్లింగ్ యాక్టివిటీస్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఇండియా మిషన్ సహకారంతో అరటి నారతో వస్తువులు తయారు చేయడంపై శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. ఇందుకూరుపేటలో 30 మంది మహిళలను ఒక బ్యాచ్‌గా ఏర్పాటు చేసి శ్రీకాకుళానికి చెందిన అప్పమ్మ ద్వారా నెల రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామన్నారు. తొలుత అరటి నార ద్వారా ఏ వస్తువులు తయారు చేస్తున్నారు, శిక్షణ ఎలా ఉంది, శిక్షణ పూర్తయిన తర్వాత సొంతగా వస్తువులను తయారు చేయగలరా, ఎంత ఖర్చవుతోంది, ఆదాయం ఎంత ఉంటుందని తదితర అంశాలపై శిక్షణ పొందుతున్న మహిళతో ముచ్చటించి ఆరా తీశారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా అరటినార ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, తహసీల్దారు కృష్ణప్రసాద్, ఏపీఎం సరిత, ఏసీ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

చీకట్లోనే బ్రహ్మోత్సవాలు

- విద్యుత్ శాఖ నిర్లక్ష్యం
- 7 గంటల పాటు సరఫరాలో కోత



విద్యుత్ లేక వెలగని కటౌట్లు

ఉలవపాడు: రథోత్సవం కోసం అంటూ విధించిన విద్యుత్ కోత చివరకు బ్రహ్మోత్సవాలను కూడా చీకటి చేసింది. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మండల కేంద్రంలో 7 గంటలపాటు విద్యుత్ లేదు. సాధారణంగా ప్రతి ఏడాది సాయంత్రం 5 గంటలకు రథోత్సవం ప్రారంభమై 7 గంటల్లోపు ముగిసేది. ఆ తర్వాత విద్యుత్ వెంటనే ఇచ్చేవారు. అయితే ఈ ఏడాది రథం స్థానంలో పుష్పపల్లకి రథం ఏర్పాటు చేశారు. ఇంకా త్వరగా పూర్తి కావాల్సి ఉన్నా బాగా ఆలస్యంగా ప్రారంభించారు. దీంతో రథోత్సవం 6.30 గంటలకు ప్రారంభమై 8.45 గంటలకు తిరిగి గుడి వద్దకు వచ్చింది. అయితే విద్యుత్ శాఖ అధికారులు మాత్రం మధ్యాహ్నం 2.45 గంటలకే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. పుష్పపల్లకి రథోత్సవం తిరిగొచ్చిన గంట తర్వాత కూడా 9.45 గంటల వరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదు. రథోత్సవానికి ముందు 3.45 గంటలు, తర్వాత గంట, మధ్యలో 2.15 గంటల లెక్కన 7 గంటల పాటు ఏకధాటిగా విద్యుత్‌కోత విధించడంలో అసలు ఎండాకాలంలో అల్లాడుతున్న జనానికి మరింత ఇబ్బంది కలిగించారు. స్థానికంగా ఏఈ లేకపోవడం, పైఅధికారులెవరూ రాకపోవడంతో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని స్థానికులు మండి పడ్డారు. బ్రహ్మోత్సవాల కోసమే విద్యుత్ సరఫరా నిలిపివేసినా.. చీకట్లోనే నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. దుకాణాలు, విద్యుత్ కటౌట్లన్నీ రాత్రి వరకు చీకట్లోనే ఉన్నాయి. రథోత్సవం మండల కేంద్రంలోని కేవలం పాతూరులోని 4 బజార్లలో మాత్రమే వెళుతోంది. దీని కోసం జంపర్‌లు ఏర్పాటు చేసి ఆ కొంత ప్రాంతం తీసి గ్రామం అంతా ఇవ్వవచ్చు. కానీ అలా చేయకుండా ఊరు మొత్తం 7 గంటలు విద్యుత్ కోత విధించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పంచాయతీ అధికారులకు బిగుస్తున్న ఉచ్చు

- కోవూరు పంచాయతీ పూర్వ కార్యదర్శిపై క్రిమినల్ కేసు?

నెల్లూరు (పొగతోట): కోవూరు పంచాయతీలో భారీ స్థాయిలో నిధులు దుర్వినియోగం చేసిన పూర్వ పంచాయతీ కార్యదర్శి బి.శివకుమార్‌పై కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ శ్రీధర్‌రెడ్డి క్రిమినల్ కేసు నమోదుకు రంగం సిద్ధం చేశారు. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి అప్పటి ఈఓపీఆర్డీ, డీఎల్‌పీఓ, డీపీఓ ఆడిట్ నిర్వహించిన అధికారులపైనా వచ్చిన అభియోగాలపై నివేదిక సిద్ధం చేయాల్సిందిగా కమిషనర్ ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకునేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. దుర్వినియోగమైన నిధుల రికవరీకి చర్యలు తీసుకోనున్నారు. గతంలో పనిచేసిన డీపీఓ, డీఎల్‌పీఓ, ఈఓపీఆర్డీలను పూర్తిస్థాయిలో విచారించనున్నారు. కోవూరు పంచాయతీలో రూ.కోటి పైగా నిధులు దుర్వినియోగం అయినట్లు నిర్ధారించారు. ప్రస్తుతం వింజమూరులో పనిచేస్తున్న కోవూరు పంచాయతీ పూర్వ కార్యదర్శి శివకుమార్‌ను సస్పెండ్ చేశారు. అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేయనున్నారు.

రిజిస్ట్రేషన్ల శాఖ నెల్లూరు డీఐజీగా మునిశంకరయ్య

సాక్షి, అమరావతి: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఎం మునిశంకరయ్యకు డీఐజీగా పదోన్నతి ఇచ్చి నెల్లూరు డీఐజీగా నియమించారు. డీఐజీ పదోన్నతుల ప్యానల్ జాబితాలో ఉన్న ఆయనకు ఇచ్చిన ఈ పదోన్నతి కేవలం తాత్కాలికమని, ఆయన్ను ఎప్పుడైనా మళ్లీ జిల్లా రిజిస్ట్రార్‌గా రివర్ట్ చేయొచ్చని, ఈ పదోన్నతి కోర్టు తీర్పునకు లోబడి ఉంటుందని బుధవారం జీఓ జారీ చేసింది.

పాలిసెట్‌లో బాలికలదే హవా

నెల్లూరు(టౌన్): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన పాలిసెట్‌లో బాలికలు తమ సత్తా చాటారు. గత నెల 30న జిల్లా వ్యాప్తంగా మొత్తం 10 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 4,081 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3,529 మంది హాజరయ్యారు. వీరిలో 3,405 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో బాలురు 95.51 శాతం, బాలికలు 98.2 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 96.49 శాతం ఉత్తీర్ణత సాధించారు.

స్మార్ట్ మీటర్లు, విద్యుత్ కొనుగోళ్లపై
టీడీపీ ద్వంద్వ వైఖరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

- గతంలో కోర్టుల్లో కేసులు వేసిన టీడీపీ ఎమ్మెల్యేలు
- ఇప్పుడు ఇదే బాటలో పయనిస్తున్న కూటమి ప్రభుత్వం
- కేసులు కొనసాగిస్తారా? ఉపసంహరించుకుంటారా?
- విద్యుత్ కొనుగోళ్లలో రూ.1.25 లక్షల కోట్ల అక్రమాలు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, ఈ విషయంలో ద్వంద్వ వైఖరిని అవలబిస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. బుధవారం నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న సీపీఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయకుండా జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హైకోర్టుకు వెళ్లారని, పయ్యావుల కేశవ్ కూడా విద్యుత్ కొననుగోళ్ల విషయంలో కోర్టుకు వెళ్లారని వీరు ఇప్పుడు ప్రభుత్వం చేస్తున్న విద్యుత్ కొనుగోళ్లు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విషయాల్లో కేసులను కొనసాగిస్తారా? ఉపసంహరించుకుంటారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఒక విధంగా, అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. విద్యుత్ కొనుగోలు విషయంలో కూటమి ప్రభుత్వం రూ.1.25 లక్షల కోట్లపైగా అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. అదే విధంగా టిడ్కో గృహాలు ఇప్పటికీ లబ్ధిదారులకు ఇవ్వలేదని, గత ఎన్నికల సమయంలో టీడీపీ చెప్పిన విధంగా పేదలకు నగరాల్లో నివసించే వారికి 2 సెంట్లు, గ్రామాల్లో నివసించేవారికి 3 సెంట్లు భూమి ఇచ్చి రూ.5 లక్షల ఇంటి నిర్మాణానికి అందజేయాలని డిమాండ్ చేశారు.

అమెరికా ఒత్తిడికి తలొగ్గిన మోదీ

అమెరికా ఆదేశాలతో కాల్పుల విరమణ జరిగిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా చెప్పడంతో మనదేశ ప్రతిష్ట పూర్తిగా దిగజారిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు దుయ్యబట్టారు. ఉగ్రవాదుల్ని తుదముట్టించే వరకు ఆపరేషన్ సిందూర్ ఆగదని దేశ ప్రజలను ప్రదాని మోదీ మభ్య పెడతున్నారని విమర్శించారు. తీవ్రవాదుల్ని మట్టుబెట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందిన మోదీ దాన్ని కప్పిపుచ్చుకునేందుకు, ఆపరేషన్ సిందూర్ సక్సెస్ అంటూ తిరంగా ర్యాలీ చేపట్టాలని బీజేపీ నిర్ణయించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దేశ ప్రజలను ఐక్యం చేసి, కశ్మీర్ ప్రజల మనోభావాలను పరిగణలోకి తీసుకుని అన్ని పార్టీలను ఒక తాటి పైకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కశ్మీర్ విషయంలో తాము మధ్యవర్తిత్వం నెరిపామని ట్రంప్ చెప్పడం మోదీ చేతకాని తనం బయట పడినట్లు అయిందన్నారు. దేశాన్ని, మోదీని ట్రంప్ ఆదేశిస్తున్నారని ఇది ఎంతో సిగ్గు చేటన్నారు. మతపరమైన ప్రసంగాలు, రెచ్చగొట్టే ప్రసంగాలు చేసే పవన్‌కళ్యాణ్ కాల్పుల విరమణపై నోరువిప్పడం లేదన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు బోల్తా

• 8 మందికి గాయాలు

పెళ్లకూరు: మండలంలోని అక్కంగారిపేట సమీపంలో బుధవారం కారు డివైడర్‌ను ఢీకొని అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు.. కారు తిరుపతి నుంచి నెల్లూరుకు వెళ్లొంది. దారిలో అక్కంగారిపేట గ్రామ సమీపంలో డివైడర్‌ను ఢీకొని అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న ఎనిమిదిమందికి గాయాలయ్యాయి. వారిని స్థానికులు శ్రీకాళహస్తికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృత్యువాత



గూడూరు రూరల్: గూడూరు రూరల్ పరిధిలోని యమహా షోరూం సమీపంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ గీతాకుమారి, రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేస్తున్నట్టు తెలిపారు. వయసు సుమారు 55 ఏళ్లు ఉండొచ్చన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 96344 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలంటూ 20న సమ్మె

పొదలకూరు: నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20వ తేదీన దేశవ్యాప్త సమ్మె చేస్తున్నట్టు ఐఎఫ్‌టీయూ జిల్లా నేత రమేష్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగంలో పొందుపర్చిన కార్మికుల హక్కులు, చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లను తీసుకొచ్చి అమలు చేయాలనుకోవడం దారుణమన్నారు. రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు డీవీ పోలయ్య, నేతలు వెంగళ్రావు, మమత పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీ, పాలిసెట్ ఫలితాల్లో విశ్వం విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: ఏపీఆర్‌జేసీ, పాలిసెట్ ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారని ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి బుధవారం తెలిపారు. ఏప్రిల్ 25న నిర్వహించిన ఏపీఆర్‌జేసీ పరీక్ష ఫలితాల్లో వై.దేదీప్యా రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్, కె.మునిదాకేష్ 7వ ర్యాంక్, జె.అంజలి 9వ ర్యాంక్, మనీషా 10వ ర్యాంక్ సాధించినట్టు పేర్కొన్నారు. పాలిసెట్‌లో ఎం.కావ్య 120 మార్కులకు 117 మార్కులు సాధించి బాలికల విభాగంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంక్‌ను సాధించినట్టు తెలిపారు. పలువురికి జిల్లా స్థాయిలో ర్యాంకులు వచ్చాయన్నారు. విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ తులసీ విశ్వనాథరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లాలో రవాణా రంగం పరిస్థితి చాలా దారుణంగా ఉంది. వాహనాలకు బాడుగలు లేకపోవడం, ఎప్పటి నుంచో అవే కిరాయిలు, పెరిగిన బీమా, టైర్లు, విడిభాగాల ధరలతో యజమానులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఇప్పుడు జిల్లా మొత్తానికి ఒకేచోట ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడం వారిని మరింత ఇబ్బందులకు గురి చేయనుంది. రవాణా వాహనాల ఫిట్‌నెస్ బాధ్యత ప్రైవేట్ సంస్థకు అప్పగించడంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

• రవాణా వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ బాధ్యత ప్రైవేట్‌కు..
• జిల్లాలో అన్ని రవాణా వాహనాలకు ఒకచోటే..
• ముత్తుకూరులో త్వరలో కేంద్రం ప్రారంభం
• దూరంలో ఉన్న మండలాల నుంచి వాహనాలు ఇక్కడికి రావాల్సిందే..
• ఒక్కో దానిపై రూ.5 వేల నుంచి రూ.7 వేల అదనపు భారం
• ఇప్పటికే ముత్తుకూరు రోడ్లలో ట్రాఫిక్ సమస్యలు

ముత్తుకూరు ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్



‘ఎఫ్‌సీ’ తలనొప్పి

జిల్లాలో..

రవాణా వాహనాలు : 1.62 లక్షలకు పైగా..

రోజుకు ఆయా కార్యాలయాల్లో ఎఫ్‌సీల జారీ : 150 కు పైగా వాహనాలకు..

నెల్లూరు(టౌన్): జిల్లాలో 1.62 లక్షలకు పైగా ఆయా రవాణా వాహనాలున్నాయి. వీటిల్లో 45,214 ఆటోలు, 38,500 లారీలు, టిప్పర్లు, 3 వేలకు పైగా ట్రాక్టర్లు, 250కు పైగా ప్రైవేట్, కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులు, మిగిలినవి టాటా ఏస్‌లు, టాటా మేజిక్‌లు, కార్లు, ట్యాంకర్లు తదితరాలున్నాయి. వీటిక్ లోపు వాహనాలైతే రెండేళ్లకు ఒకసారి, పాతవైతే ప్రతి ఏడాది ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను (ఎఫ్‌సీ) తీసుకోవాలి. జిల్లాలో నెల్లూరుతోపాటు ఆత్మకూరు, కావలి, కందుకూరు ప్రాంతాలకు వాహనాలను తీసుకెళ్లి ఫిట్‌నెస్ చూపించుకుని ఆ సర్టిఫికెట్‌ను పొందేవారు. ఈ సమయంలో రవాణా అధికారులు బీమా, పొల్యూషన్, పర్మిట్, ఆర్సీ తదితరాలను పరిశీలించేవారు. నకిలీ పత్రాలు పెడితే వెంటనే తెలుసుకుని ఎఫ్‌సీ ఇవ్వకుండా నిలిపివేశారు. వాహనానికి సంబంధించి పూర్తి సమాచారం అధికారుల వద్ద ఉంటుంది.

ప్రస్తుతం ఇలా..

జిల్లాలో ఆయా రవాణా శాఖ కార్యాలయాల్లో రోజూ 150కు పైగా వాహనాలకు ఎఫ్‌సీలు జారీ చేస్తున్నారు. నెల్లూరులో 80 నుంచి 100, మిగిలిన కేంద్రాల్లో 50 నుంచి 70 వాహనాలకు ఇస్తున్నారు. ఆటోలకు రూ.650లు, ట్రాక్టర్లు, టాటా ఏస్‌లు, టాటా మేజిక్‌లకు రూ.750లు, లారీలకు రూ.920లు ప్రభుత్వ ఖజానా చెల్లించాల్సి ఉంది. అయితే ఈ సమయంలో లారీ అన్నివిధాలా కండిషన్‌లో ఉండాలి.

యజమానులపై అదనపు భారం

కొత్తగా ఎఫ్‌సీ జారీ బాధ్యతను ప్రభుత్వం ప్రైవేట్ సంస్థకు అప్పగిస్తోంది. ఇందులో భాగం

ప్రమాదాలకు నిలయం

ప్రస్తుతం ముత్తుకూరు రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. రోజూ కృష్ణపట్నం పోర్టుకు వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పుడు ఎఫ్‌సీ కోసం వచ్చే వాహనాలు కూడా ఆ రోడ్డులో ప్రయాణిస్తే ట్రాఫిక్ సమస్య వస్తుంది. కాగా ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటుపై సమీపంలోని కప్పలదొరువు గ్రామ ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ ఆనంద్‌ను కలిసి విన్నవించినట్టు తెలిసింది. ఇక్కడ ఎఫ్‌సీ స్టేషన్ పెడితే ప్రమాదాలు అధికమవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతున్నారు.

గా ముత్తుకూరు సమీపంలోని కప్పలదొరువు ప్రాంతంలో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మరికొద్దిరోజుల్లో దీనిని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కాగా సదరు సంస్థ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందని యజమానుల్లో ఆందోళన ఉంది. అదే ప్రభుత్వ అధికారులుంటే కొంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారని పేర్కొంటున్నారు. టెస్టింగ్ స్టేషన్ వల్ల రవాణా వాహన యజమానులపై అదనపు భారం పడనుంది. ఇప్పటి వరకు ఉదయగిరి, సీతారామపురం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలకు కావలిలోని రవాణా కార్యాలయంలో, ఆత్మకూరు, కందుకూరు సమీప ప్రాంతాల్లో వాహనాలకు అక్కడ కార్యాలయాల్లో సర్టిఫికెట్ ఇచ్చేవారు. ఇప్పుడు సీతారామపురం నుంచి ముత్తుకూరుకు సుమారు 150 కిలోమీటర్లు ఉంటుంది. లారీలు అక్కడి నుంచి రావాలంటే 60 లీటర్లకు పైనే డీజిల్ అవసరమవుతుంది. అంటే రూ.6 వేలు అదనపు భారం పడుతుంది. అదే ట్రాలీలు, పెద్ద వాహనాలైతే మరో రూ.1,000 నుంచి రూ.1,500లు ఖర్చు చేయాల్సి ఉంది. కందుకూరు నుంచి ముత్తుకూరుకు 140 కిలోమీటర్లు ఉంటుంది. అక్కడి నుంచి రావాలంటే 58 లీటర్ల డీజిల్ అవుతుంది. అంటే రూ.5,800లు అదనంగా భరించాలి. ఆటోల యజమానుల పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. 150 కిలోమీటర్లు రావాలంటే చాలా కష్టం. పైగా అదనంగా రూ.1,500లు ఖర్చు పెట్టాలి. ట్రాక్టర్ల పరిస్థితి అంతే. ప్రయాణం నరకమే. డీజిల్ ఖర్చుతోపాటు భోజనం ఖర్చు అదనం. రోజుకు ఎన్ని వాహనాలకు ఎఫ్‌సీ జారీ చేస్తారో ఇంకా స్పష్టత లేదు. లేదా అక్కడికెళ్లక కండిషన్ బాగోలేదని మెలిక పెడితే రిపేర్ చేయిస్తుకునేందుకు మరో 20 కిలోమీటర్లు ప్రయాణించి నెల్లూరుకు రావాల్సి ఉంటుంది. ఇదంతా అదనపు భారమే.

వ్యతిరేకిస్తున్నాం



ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌ను ప్రైవేట్ సంస్థకు అప్పగించడాన్ని అసోసియేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దీనిపై ప్రిన్సిపల్ సెక్రటరీని కలిశాం. దూర ప్రాంతాల నుంచి వాహనాలు రావాలంటే ఇబ్బందిగా ఉంటుంది. ఒక్కో వాహన ఎఫ్‌సీకి 20 నిమిషాల సమయం పడుతుంది. ఒకవేళ రిపేర్ అంటే నెల్లూరు పోవాల్సిందే. షోరూం, షెడ్ యజమానులను బలికెండంనికే ఎఫ్‌సీ స్టేషన్‌ను పెడుతున్నారు. ఇప్పటికే కిరాయిలు లేక రవాణా రంగం దివాళా తీసిన పరిస్థితి ఉంది.

– గోపాల్‌నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు, లారీ యజమానుల అసోసియేషన్

చంపుతామని బెదిరించి నగదు దోపిడీ

నెల్లూరు(క్రైమ్): రైలు దిగి నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు చంపుతామని బెదిరించి నగదు దోచుకెళ్లిన ఘటన నెల్లూరులోని సింహపురి హోటల్ సమీపంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సంగం మండలం మర్రిపాడు గ్రామంలో వీరరాఘవయ్య నివాసం ఉంటున్నాడు. ఆయన పదిరోజుల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తెల వద్దకు వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున రైల్లో నెల్లూరుకు చేరుకున్నారు. ఆత్మకూరు బస్టాండ్‌కు నడుచుకుంటూ బయలుదేరారు. సింహపురి హోటల్ వద్దకు వచ్చేసరికి గుర్తుతెలియని ఆరుగురు వ్యక్తులు రెండు బైక్‌లపై వీరరాఘవయ్య వద్దకు వచ్చారు. కత్తితో చంపుతామని బెదిరించి రూ.1,000 నగదును దోచుకెళ్లారు. బాధితుడు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై జి.బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహం గుర్తింపు



ఘటనా స్థలంలో మృతదేహం

ఆత్మకూరు: పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా దుకాణాల ముందు బుధవారం తెల్లవారుజామునే వృ ద్ధుడి మృతదేహాన్ని పలువురు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. విచారణలో మృతుడిని వింజమూరుకు చెందిన జి.హరిబాబుగా గుర్తించారు. ఆతను కొద్ది రోజులుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆత్మకూరులోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నాడని పోలీసులు తెలిపారు. మంగళవారం సైతం పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆస్పత్రికి చికిత్స చేయించుకున్నాడని తెలిపారు. ఆరోగ్యం బాగోలేక మృతిచెంది ఉంటాడని చెప్పారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

అత్తారింటికి చేరిన నృసింహుడు



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు



స్వామి, అమ్మవార్లను గోనుపల్లికి తీసుకెళ్తున్న భక్తులు

రాపూరు: పెంచలకోనలో ఆదిరోజులపాటు బ్రహ్మోత్సవాలు జరుపుకున్న ఆనంతరం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, చెంచులక్ష్మీల వివాహం చేసుకుని గోనుపల్లి గిరిజనవాడలోని అత్తారింటికి బుధవారం చేరుకున్నారు. మండలంలోని గోనుపల్లి గ్రామంలోని ఆలయంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీ ఉత్సవ విగ్రహాలను బ్రహ్మోత్సవాల ముందురోజు పెంచలకోనకు వల్లకిలో తీసుకెళ్లారు. ఉత్సవాలు ముగిశాక తిరిగి ఆ గ్రామానికి తరలించడం ఆనవాయితీ. కోనలోని క్రేన్ మండపం వద్ద స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కొలువుదీర్చి పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. బోయల కాలి నడకన గోనుపల్లికి బయలుదేరారు. దేవస్థాన అధికారులు, పోలీస్, అర్చకులు పెంచలకోన ఆర్చి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి వీడ్కోలు పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఆ గ్రామంలోని గిరిజన కాలనీ వద్దనున్న చెంచురాజు ఇంటికి దొడ్డిదారిలో తీసుకెళ్లారు. కల్యాణం అనంతరం స్వామి దొంగదారిలో గ్రామానికి వచ్చారని నానుడి. పెంచలస్వామి గిరిజన వనిత అయిన చెంచులక్ష్మిని వివాహం చేసుకోవడంతో ఆయనను తమ అల్లుడిగా భావిస్తారు. గోనుపల్లి నుంచి ఉత్సవ విగ్రహాలను కోనకు తరలించే సమయంలో స్వామిని గిరిజనులు పెళ్లికొడుకుని చేసి అల్లుడికి ఇవ్వాల్సిన కట్నకానుకల కింద ఆరెముంతాడు, ఇంజేటీ గడ్డ, పుట్ట తేనె మొదలైనవి సమర్పిస్తారు. అలాగే స్వామి తిరిగొచ్చే సమయంలో అడవి ఫలాలను అందజేయడం ఆనవాయితీ. శ్రీవారిని ఉదయం నుంచి సాయంత్రం వరకు గిరిజన కాలనీలోనే ఉంచడంతో గిరిజనులు తమ కొత్త అల్లుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి పండగ చేసుకున్నారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీ శ్రీనివాసులురెడ్డి, ఫెస్టివల్ కమిటీ సభ్యులు చెన్ను తిరుపాల్‌రెడ్డి, ఇవ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, భక్తులు పాల్గొన్నారు.

బకాయిల విడుదల అవాస్తవం

• మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపిన సీహెచ్‌ఓలు



నిరసన తెలుపుతున్న సీహెచ్‌ఓలు

నెల్లూరు(అర్బన్): డిమాండ్లు తీర్చాలని తాము నిరసన తెలుపుతుంటే పెండింగ్ బకాయిలు విడుదల చేసినట్టు ప్రభుత్వం అబద్ధపు ప్రచారం చేస్తోందని సీహెచ్‌ఓల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భాను మహేష్ తెలిపారు. జిల్లాలో సీహెచ్‌ఓలు చేస్తున్న సమ్మె బుధవారం నాటికి 16వ రోజుకు చేరింది. నెల్లూరులోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన దీక్ష చేశారు. అనంతరం భాను మహేష్ మాట్లాడుతూ బకాయిలు రూ.77,33,81,250లు అందించినట్టు ప్రభుత్వం పత్రికా ప్రకటనలు ఇవ్వడం అన్యాయమన్నారు. తమ బ్యాంక్ ఖాతాల్లో ఒక్క రూపాయి కూడా జమ కాలేదన్నారు. బకాయిలు ఈరోజు కాకపోతే ఇంకో రోజైనా వస్తాయన్నారు. ప్రధానమైన డిమాండ్లు తీర్చాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతనాలు పెంచాలని, వర్క్ చార్జ్ నిబంధనలు విడుదల చేయాలని, విలేజ్ హెల్త్ క్లినిక్ అద్దెలు చెల్లించాలని, పీఎఫ్‌ను పునరుద్ధరించాలని కోరారు. అప్పటి వరకు ఆందోళనలు ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కో–ఆర్డినేటర్ ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.90
సన్నవి	రూ.50
పండ్లు	రూ.30

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	125
లేయర్ (లైవ్)	110
బ్రాయిలర్ చికెన్	224
బ్రాయిలర్ స్కిన్‌లెస్	250
లేయర్ చికెన్	187

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి.

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతిచెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి నెల్లూరులోని మూడోమైలు బ్రిడ్జిపై చోటుచేసుకుంది. ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు.. రామలింగాపురంలో కిషన్‌కుమార్, పుష్పలతారెడ్డి (40) దంపతులు నివాసం ఉంటున్నారు. పుష్పలతారెడ్డి తన కుటుంబ స్నేహితుడైన కిరణ్‌కుమార్‌తో కలిసి మంగళవారం రాత్రి మోటార్‌బైక్‌పై కోవూరు నుంచి నెల్లూరుకు జాతీయ రహదారిపై బయలుదేరారు. మూడోమైలు బ్రిడ్జి వద్దకు చేరుకునేసరికి ఆమె చున్నీ బైక్ చైన్‌లో ఇరుక్కుపోవడంతో అదుపుతప్పి కింద పడింది. దీంతో తీవ్రగాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను అటుగా వెళ్తున్న వారు చికిత్స నిమిత్తం మెడికవర్ హాస్పిటల్లో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. మృతురాలి భర్త నార్త్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నార్త్ ట్రాఫిక్ ఎస్సై జె.బలరామిరెడ్డి బుధవారం తెలిపారు.

లారీ ఢీకొని..

మర్రిపాడు: రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి మర్రిపాడు మండలంలోని నందవరం సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు జిల్లా అల్లూరుకు చెందిన సూరి వినయ్‌కుమార్ (43) లోడ్ లారీతో గుంటూరు వైపు నుంచి కడప వెళ్తున్నాడు. నందవరం గ్రోత్ సెంటర్ దాటిన తర్వాత ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టడంతో వినయ్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలిస్తున్న క్రమంలో ఏఎస్‌పేట మండలం సమీపంలో మృతిచెందాడు. మృతుడి బంధువులకు సమాచారం అందించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు బుధవారం తెలిపారు.

తీర గ్రామాల్లో సోలార్ కాంతులు

దగదర్తి/ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అదానీ ఫౌండేషన్ మండలంలోని తీర ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టింది. బుధవారం తమ్మినపట్నం పంచాయతీలో ఆ ఫౌండేషన్ హెడ్ రాజేష్‌రంజన్ మాట్లాడుతూ తమ్మినపట్నంలో సుమారు 150 సోలార్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశామన్నారు. ఐటీఐవ గ్రామాల్లోని మత్స్యకార యువత కోసం మేజరు క్రికెట్ పోటీలు నిర్వహించామన్నారు. అలాగే విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. స్థానిక నాయకులు కోటి సతీష్‌యాదవ్, మత్స్యకార నాయకులు బిక్కాని రామయ్య, మేకల వెంకయ్య, నాగూరు, సుబ్బయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సోలార్ విద్యుత్ దీపం